శ్రీ రమణ జ్యోతి
ఫిబ్రవరి 2022

Sri Ramana Jyothi
February 2022

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 91వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 13 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు** | మల్లాది ఫణిమాల | 17 |
| **4.** | **అనుస్మరణీయులు (జీ.వి.సి.హెచ్. లక్ష్మీనారాయణ)** | శ్రీమతి జలజ | 24 |
| 5. | Follow the Deshika's Disha | Dr. K. Subrahmanian | 30 |
| 6. | Self-Knowledge | V. Krithivasan | 38 |
| 7. | Stories of Bhagavan and Animals | | 47 |
| 8. | For Whom is the Hundi? | | 50 |


## Events in Sri Ramana Kendram in February 2022

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 14th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
4. 1st March - Mahasivarathri

(Devotees may please note that due to the ongoing Pandemic and local Government restrictions, the Kendram will remain closed, till further notice. Online satsangs will continue as usual. For details please contact the Kendram office)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# కావ్యకంఠ

డా॥ కే.యస్. గారి 91వ ప్రవచనం
అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

భగవాన్ కావ్యకంఠ గణపతి ముని గురించి ఇలా అనేవారు: 'శక్తిమంతమపి శాంతి సంయుతం, భక్తిమంతమపి భేదవర్జితం, వీతరాగమపి లోకవత్సలం, దేవతాంశమపినమ్ర చేష్టితం.'

అపారమైన అధికారం, బలం, కలిగినవారు వాటిని వాడు కుంటారు. అలాంటి బల, దర్పాలతో ఇతరులపై తమ ప్రభావాలను ప్రదర్శించుకుంటే, వాళ్ళు గొప్పగా మెచ్చుకోవచ్చు. అలాంటప్పుడు మన గర్వం ఎక్కువవుతుంది. ఇతర మునులు, సాధువుల వలే భగవాన్ విషయంలో కూడ శక్తి, సామర్థ్యాలు తాము అనుభవించే శాంతి నుండి లభించేవి. సామాన్యులకు బలం, అధికారాలు మెండుగా వున్న పరిస్థితుల్లో కూడ, శాంతి కరవవుతుంది. ఎందుకంటే శక్తి, సామర్థ్యాల నుండి శాంతి పుట్టుకు రాదు. అవి మరింత గర్వానికి దారి తీస్తాయి. భగవాన్ యొక్క శక్తి, వారి ప్రశాంతత నుండి ఉద్భవించింది. అది విశ్వవ్యాప్తమైనది, అహం నుండి లభించిన శక్తి కాదు, అహం నాశనం కారణంగా ఏర్పడింది.

## భక్తి - దేవుడు, వ్యక్తి

భక్తిమంతమతి, భేద వర్జితం - సాధారణంగా మనం భక్తి గురించి చెప్పుకునేటప్పుడు, ఒక దేవుడున్నాడు, ఒక వ్యక్తి వున్నాడని భావిస్తాం. ఒక భక్తుడు, ప్రభువు వున్నారని భావిస్తాం. కాని భగవాన్,

అలాగే ఋషులు, మునుల విషయంలోనైతే, ఆయన ఒక భక్తుడే కాని, అన్ని భేద భావాల నుండి దూరమైనవాడు. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఉన్నత స్థాయిలో జ్ఞానం, భక్తి అన్న భేదం లేకుండ ఏకమైనవి. విభక్తి లేని చోట భక్తి వుంటుంది. ప్రభువుతో ఏకత్వాన్ని గుర్తించడం జరుగుతుంది. అందువల్లనే కావ్యకంఠులు అసాధారణ భక్తుడని మహర్షి అనేవారు.

శక్తిమంతమపి శాంతి సంయుతం, భక్తిమంతమపి భేద వర్జితం, వీతరాగమతి లోకవత్సలం, దేవతాంశమతి, నమ్ర చేష్టితం. ఇవి అన్నీ వ్యతిరేకార్థ పదాలు. కావ్యకంఠ రాగద్వేషాలు లేనివాడు, కోరికలు గాని ఏ భేద భావాలు గాని లేనివాడు. కాని లోక వత్సలం - గొప్ప దయాభావం, సకలులను ప్రేమించే స్వభావం గలవాడు. మనం కూడ ఇతరులను ప్రేమిస్తాం. కాని అందులో భేదం తెలుస్తుంది. మనం కొందరిని ప్రేమిస్తాం, ఇతరులంటే ఇష్టపడం, అంటే, అది భేదభావం చూపించే ప్రేమ. కొందరిని ఎన్నుకొని ఇతరులను వదిలేస్తాం. ఆసక్తిలేమిని (detachment) గురించి ప్రస్తావిస్తే మనం ఒక బండరాయి లాగ ప్రవర్తించాలని మనం భావిస్తాం. మీ సమస్య గురించి నాతో చెప్పడానికి వస్తే, జవాబుగా "ఓ, ఇవన్నీ మనస్సు సృష్టించినవి, అందుకే అలాంటి భావాలను అధిగమించాలి" అని అనాలనిపిస్తుంది. ఇది మెట్ట వేదాంతం.

**ఇతరుల బాధను అనుభవించాలి**

ఎవరైనా తమ వద్దకు వచ్చి కష్టాలను చెప్పుకుని ఏడిస్తే, మహర్షి శాంతంగా చెప్పినవి విని, తాము చెప్పేవి ఎంతో దయతో చెప్పి

ఓదార్చేవారు. కొన్ని సందర్భాలలో తామూ కన్నీళ్ళు కార్చేవారు. నిజమైన దయ అంటే ఒక బాధను మన హృదయంలో అనుభవించడం. అలా కాకుండ, వీటిని పట్టించుకోకూడదు, అలాంటి వాటికి అతీతంగా వుండాలని చెబితే, అది ఏ కోశానా దయ అనిపించుకోదు. దయా స్వభావం లేకుండ తాము ఏదో, మతాన్ని అనుసరిస్తున్నామనుకోవడంలో అర్థం లేదు. అందుకే, ఇతరుల పట్ల ప్రేమ, దయ చూపడం ఎంతో ముఖ్యమని మహర్షి ఎల్లప్పుడూ నొక్కి చెప్పేవారు, అదే విధానాన్ని ఆయన జీవితాంతం అనుసరించారు కూడ.

కొందరి పట్ల మనం చూపే ప్రత్యేక ఆసక్తి attachment మాత్రమే. భగవాన్ ప్రజలందరి పట్ల నిజమైన ప్రేమాభిమానాలు చూపేవారు. అనాసక్తత (detachment) అంటే ఇతరుల పట్ల విముఖత కాదు. జె. కృష్ణ మూర్తిగారు ఒక చక్కని వ్యాఖ్యానంలో ''నిజమైన అనాసక్తత అంటే అందరి పట్ల ఆసక్తి అని తెలుసుకోవాలన్నారు. detachment అంటే ఇతరుల పట్ల విముఖత అని భావిస్తే ఇతరులకే కాకుండ మనకూ హాని కలిగించడం'' అన్నారు. భగవాన్ వద్దకు వచ్చినవారు తమ బాధలు, కష్టాలను గురించి చెప్పుకున్నప్పుడు ఆయన ఎంతో శ్రద్ధగా వినేవారు. తమ కష్టాలు, దుఃఖాలను గురించి మన వద్దకు వచ్చి వారి మాటలను శ్రద్ధతో ఆలకిస్తే, వారి దుఃఖం సగం మేరకు తగ్గినట్లే. అంటే దగ్గరకు వచ్చిన ఇతరులపై శ్రద్ధ కనబరిస్తే, విషయాన్ని అర్థం చేసుకొని, ఏమీ ఆశించకుంటే, మనకు తెలియకుండగనే వాళ్ళ సేవ చేసిన వారమవుతాము. అందుకే బాధను పంచుకున్నప్పుడు అది

సగమౌతుంది. పంచుకున్న సంతోషం రెండింతలవుతుంది. ఈ విషయాల గురించి భగవాన్ ఎప్పుడూ ప్రస్తావించలేదుగాని ఆయన చూపే శ్రద్ధ ఫలితంగా చాలామంది ఎంతో హాయి, తృప్తితో వెనుదిరుగుతారు. కొన్ని సమయాలలో అసలు ఏమీ మాట్లాడకుండగనే దయాపూర్ణమైన చూపు ప్రసరింప జేయడంతో ఎందరో శాంతిని పొందుతారు.

భగవాన్ నుండి ఈ విషయంలో మనం ఎంతో తెలుసుకొనవలసి వుంది. కష్టాలను చెప్పుకొనడానికి వచ్చిన వారికి కష్టాలు అందరికీ వివరించి వస్తుంటాయి, ఎక్కువ ఆలోచించకు అని చెప్పడం వల్ల ప్రయోజనం వుండదు. అవతలి వ్యక్తి ఏ పరిస్థితుల్లో వున్నాడో గ్రహించి తగిన విధంగా సమాధానపరిస్తే ఎంతో సహాయకారిగా వుంటుంది. ఆ వ్యక్తి స్థానంలో మనం ఊహించుకుని, ఏదో ఓదార్పు అందిస్తే ఉపయోగముండదు. ప్రతి వ్యక్తి సమస్యలకు ఒక నిర్దిష్టమైన అనుభవాలు, కారణాలు వుంటాయి. వాటిని సంపూర్ణంగా అవగాహన చేసుకొనడం, భగవాన్ లాంటి మహాత్ములు, ముని, సాధువులకే చేతనవుతుంది. మన అనుభవంలో భగవాన్ ఇప్పుడు భౌతికంగా లేనప్పటికి, ఆయనతో కష్టాలను విన్నవించుకున్నవారికి ఈనాటికీ, మనకు అవసరమైన శాంతి, పరిష్కారాలు తెలియవస్తాయి.

## ఆర్తితో కోరితే ప్రశాంతత

భగవాన్ జీవితకాలంలో జరిగినట్లే ఇప్పటికీ ఆర్తితో కోరినప్పుడు ప్రశాంతత లభిస్తుంది. అది ఒక్క మహర్షి విషయంలోనే

కాదు. ఒకరు నమ్ముకున్న గురువుకు అందులో గొప్ప, చిన్న అన్న తేడాలు లేకుండ మన కష్టాలను ఆర్తితో విన్నవించుకుంటే గురువు మనకు అవసరమైన శాంతిని ప్రసాదించడం జరుగుతుంది. మహర్షి జీవితకాలంలో జరిగిన సంఘటనలు మనం యథార్థంగా తెలుసుకొనడం వీలుకాదు. మహర్షిని ప్రేమించి మన హృదయాలను అర్పించడానికి కూడ ఆయన దయాదృక్కులు మనపై ప్రసరించాల్సి వుంటుంది. ఆయనకు శరణాగతి చెందడానికీ ఆయన దయ అవసరం.

వీతరాగమతి లోకవత్సలం, దేవతాంశమపి, నమ్ర చేష్టితం - మన దేశంలో జన్మించిన అతి గొప్ప పురుషుల్లో కావ్యకంఠ ఒకరు. కాని ఆయన గురించి విశదంగా మనవారు తెలుసుకొనకపోవడం, దురదృష్టకరం. ఆయన ఒక గొప్ప మేధావి, అసాధారణ వ్యక్తి, మన దేశపు ఉన్నతస్థాయి సంస్కృత కవి, పండితుడు. మన దేశం యొక్క స్వాతంత్ర్య సిద్ధి కోసం, మంత్రజపాలతో జీవితకాలమంత ఆశించి, కృషి చేసిన మహనీయుడు. స్వీయ మోక్ష సాధన కంటే దేశ స్వాతంత్ర్యానికి అధిక ప్రాధాన్యతను చూపే వ్యక్తి. తాను మహర్షి ప్రభావానికి లోనైనప్పటికీ, తనను ఆశ్రయించినవారి విషయంలో దేశ కుశలాయ ప్రార్థయతి శక్తిమ్ - నా వ్యక్తిగత మోక్షమటుంచి, ఈ దేశం అసాధారణమైనదని శిష్యులతో అనేవారు. భారత దేశం ఇతర దేశాలకు విభిన్నమైనది. కావ్యకంఠ వేదాలను, ఇతాహాస, ఉపనిషత్తులు, పురాణాలను ఔపోసన పట్టినవారు.

## పేరు మార్పు

బ్రాహ్మణస్వామిగా రమణులు చలామణీ అవుతున్న రోజుల్లో, అలా పిలవవద్దని చెప్పి, ఆయనను భగవాన్ శ్రీరమణ మహర్షిగా గుర్తించాలని ఆయన అందరికీ చెప్పారు. గణపతి మునికి చాలా మంది శిష్యులుండేవారు. వారు ఆయన సమక్షంలోనికి వచ్చినప్పుడు పాదాభివందనం చేసేవారు. తాము రమణాశ్రమం వెళ్ళినప్పుడు తనకు ఎవ్వరూ అలాగ నమస్కరించరాదని చెప్పేవారు. అక్కడ భగవాన్ ఒక్కరే నమస్కరింపదగినవారని అనేవారు. ఇటీవలి కాలంలో మహర్షి సములు ఎవ్వరూ లేరని శిష్యులతో అంటూ, మన అదృష్టం కొద్దీ అలాంటి మహనీయుడు తమ జీవితకాలంలో లభించడం ఎంతో గొప్ప విషయమని శిష్యులకు తెలియజెప్పేవారు.

భగవాన్ సమక్షంలో ఎవరైన భక్తులు తమ కళ్ళను మూసుకొని ధ్యానిస్తుంటే, ''ఎందుకు కళ్ళు మూసుకుంటార''ని ప్రశ్నించేవారు. ఇక్కడ సూర్యుడు గొప్ప తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. కళ్ళు తెరిచి, ప్రతిక్షణమూ ఆ దర్శనాన్ని చేసుకోమని ప్రోత్సహించేవారు. భగవాన్ పట్ల ఆయన భక్తి అలాంటిది.

కాని ఆయన ధ్యేయం వేరొకటి. ఎందరో రాజులు తమ తమ ఆస్థాన విద్వాంసులుగా వుండమని కోరినప్పటికీ గణపతిముని అంగీకరించలేదు. ఎంతో పేద జీవితాన్ని గడిపారు. ఎస్. దొరైస్వామి అయ్యర్ అన్న ఒక న్యాయవాది నెలకు కావ్యకంఠకు యాభై

రూపాయలు పంపేవారు. మరొక వ్యక్తి 15 రూపాయలు ఇచ్చేవారు. తాము తలచుకుంటే విలాసవంతమైన జీవితాన్ని గడిపి వుండగలడు. కాని దేశమంతటా, ప్రయాణిస్తూ, భగవాన్ గురించీ, మన దేశ సౌభాగ్యాన్ని గురించీ ఉద్బోధించేవారు.

మనకందరికీ తెలుసుగదా, కావ్యంకఠను భగవాన్ "నాయన" అని సంబోధించేవారు. అసలు, ఇతరులను మర్యాదగా పిలవడం భగవాన్‌కు అలవాటు. వయసులో భగవాన్ కంటే పెద్దవారైన కావ్యకంఠను అలా పిలిచినప్పుడు, కావ్యకంఠ 'మీరు' అని పిలవడం తాను ఒప్పుకోనని, తాను మహర్షి శిష్యుడేనని చెప్పేవారు. కాని భగవాన్ తాము అనుకొన్న ప్రకారం చేసేవారు. కావ్యకంఠ జీవితం చాలించిన తరువాత ఒకసారి మా మామయ్య అడిగినప్పుడు భగవాన్ ఇలా చెప్పారట. 'నాయన' అన్న దాన్ని రెండు విధాలుగా వాడవచ్చునని - ఒకటి తమ కంటే వయసులో పెద్దవారికి, తమ పిల్లలకు కూడ అది వర్తించగలదని కావ్యకంఠతోనే చెప్పారట. దాంతో నాయన ఎంతో సంతోషపడ్డారట. అప్పటి నుండి, ఆయన గురించి విన్నవాళ్ళు, ఆయన శిష్యులు సైతం అలా పిలిచే అలవాటు చేసుకున్నారు. మరొకసారి మా మామయ్య భగవాన్‌ను "నాయన తన జీవితాంతం దేశ స్వాతంత్ర్యం కోసం మంత్ర, జపాలతో గడిపేవారు. మరి ఆ ప్రయత్నాలన్నీ వృథా అయినట్లానని అడిగారట. నాయన సంకల్పం వృథా పోదని 1938లో అన్నారట. తొమ్మిది ఏళ్ళ తరువాత దేశానికి స్వతంత్రం లభించింది. ఎందరో

ఆ ఉద్దేశంతో మంత్ర జపాలను నిరంతరం జరుపుతూ వచ్చారు. అందులో కావ్యకంఠ ముఖ్యులు.

## దేశ స్వాతంత్ర్యం ప్రాథమిక లక్ష్యం

శ్రీ అరోబిందో గారు కూడ దేశ స్వాతంత్ర్యానికి అలాంటి ప్రయత్నం చేశారు. ఆఖరుకు చాలామంది ఆ దిశలో కృషి చేస్తున్నారని వదిలేశారు. అలాంటి గొప్పవారి తపోమహాత్యం వల్లనే మనకు స్వతంత్రం వచ్చింది. ఆ లక్ష్యంతో ప్రయత్నించిన అందరి కృషిని మనం గుర్తించాలి.

ఇక పైన పేర్కొన్న పద్యంలోని చివరి పాదం - దేవతాంశమపి, నమ్రచేష్టితం - గొప్పవాడైనప్పటికి, అసాధారణమైన నమ్రత కలిగి వుండేవాడు. ఈ విషయం ఎన్నోసార్లు చెప్పాను. ఎవరైన ఒకవైపు నడిచి వస్తుంటే, భగవాన్ ఎదుటివైపు రావడం సంభవిస్తే, ఆయన ప్రక్కకు తప్పుకుని నిలబడేవారు. ''అదేమిటి భగవాన్, అని త్రోవ ఇవ్వడానికి ప్రయత్నిస్తే, ''ఫరవాలేదు. మీరు ఏదైన పని మీద వెళ్తుంటారు, నాకేమీ పని లేదు'' అనేవారు. అది ఏదో తెచ్చిపెట్టుకున్న నమ్రత కాదు. అలాగే ప్రతి ఒక్కరితో, చిన్నపిల్లలైనా సరే అదే జరిగేది. ఆయన మన మాదిరి దృక్పథం వున్నవారు కాదు. అవతలి వారికి ఏదైన తొందర పని, రైలు కోసం వెళ్తూ వుండవచ్చు, అలాంటి ధోరణి ఆయనది.

మరొక విషయం అపురూపమైనది. మనం ఎక్కడ కూడ గురువు శిష్యులకు సేవచేసే సందర్భాలు విని వుండము. భగవాన్

తెల్లవారు ఝామున 2 గంటలకు, ప్రతిరోజూ వంటింట్లోకి వెళ్ళి కష్టమైన పనులు చేసేవారు. రసం, సాంబారు వంటివి కూడ చేసి, చట్నీ రుబ్బేవారు. వంటింట్లో పనిచేస్తామని వచ్చే స్త్రీలకు తేలికైన పనులు మాత్రమే అప్పజెప్పేవారు.

అక్కడికి వచ్చిన శిష్యులు తమ కోసం పని చేయడం వారి, కర్తవ్యమని అనడం వారికి ఇష్టముండేది కాదు. తమకు సంబంధించినంత వరకు ఏ పనీ తక్కువదని భావించేవారు కాదు. స్త్రీలు వుండడం తమ ఏకాగ్రతకు భంగం కలిగిస్తుందని అంటే, తాము ఏమీ అనకుండ ఊరికే వుండేవారు. అయితే మీ కుటుంబాలను విడిచిపెట్టమని అనేవారు కాదు. తపస్సు కోసం కుటుంబాలను వదలి వెళ్ళడాన్ని మహర్షి సమర్థించేవారు కాదు. వ్యక్తి ఎక్కడికి వెళ్ళినప్పటికీ, మనస్సు తమతో కూడ వస్తుందని, అందుకే అలా వెళ్ళడం ఉపయోగం లేదనేవారు. ఏకాంతమనేది మనస్సులో వుంటుందని, బయట కాదని, చెప్పేవారు. స్త్రీలకు మహర్షి ఇచ్చే గౌరవం గమనించదగిన విషయం. వారి పట్ల ఎంతో గౌరవం చూపే భగవాన్, స్త్రీలు కూడ సాధన చేయవచ్చుననేవారు.

తమకు వంటింట్లో ఏదైనా అవసరమొస్తే, తామే లేచి వెళ్ళి తెచ్చుకునేవారు. ఇతరులకు చెప్పేవారు కాదు.

వంటింట్లో పనిచేసే స్త్రీలు ఎవరైనా భగవాన్ దగ్గరకు వచ్చి, ‘‘భగవాన్, రోజంతా వంటింట్లో పనితోనే సరిపోతుంది. మిగిలిన భక్తులు హాలులో కూర్చొని ధ్యానం చేసుకుంటారు. వాళ్ళంటే

అసూయగా వుంది'' అని అన్నప్పుడు "ఎందుకు చింతిస్తారు? ఇక్కడకు వచ్చిన ఎంతోమందికి బాగా వండిపెడుతున్నామని, ఎంతో సేవ చేస్తున్నామని అనుకోవాలి. మీ చేతులు పనిచేస్తున్నప్పటికీ, మీ మనసులు దేవునిపై లగ్నమై వుండాలి'' అని సమాధాన పరిచే వారు. అది తమకు గొప్ప ఉపదేశమని ఒక స్త్రీ చెప్పుకొచ్చింది. ఏ పనీ, చిన్నది, పెద్దదని కాదు. భగవాన్ ఎంతో బాగా వండే వారని కావ్యకంఠ అనేవారు. తాము వ్రాసిన చత్వారింశత్ లోని ఒక పద్యంలో, కావ్యకంఠ "మీరు గొప్పగా వండుతారు. వీరు వండడం, దేన్ని? ప్రజల్లోని అహంను వండి, దాన్ని ప్రభువుకు ప్రసాదంగా ఇస్తారు. అందుకే మీరు వంట మాత్రమే కాదు, అందరి అహంను నాశనం చేస్తారు'' అని పొగిడారు.

**అణిమాది సకల సిద్ధుల**
**గణియింపక తృణమువోలె గందువయిననిన్**
**ప్రణుతించి గొలుచు సన్ముని**
**గణములు నీ మహిమలెన్న గలనే రమణా**

***- రమణ అష్టోత్తర శత పద్య కుసుమావళి***

***- శ్రీమతి సూరినాగమ్మ విరచితం***

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

**(గత సంచిక తరువాయి)** **అనువాదం: జి. శ్రీహరిరావు**

గిరి ప్రదక్షిణల నుండి సెలవు తీసుకునే ముందు శ్రీ భగవాన్ తెలియపరిచిన కొన్ని విషయాలు చెప్పాలి. చాలా మందికి ఇవి తెలియక పోవచ్చు. 1922 దాకా శ్రీ భగవాన్ గిరి ప్రదక్షిణకు వెళ్లే వారు. వారితో పాటు అనేకమంది భక్తులూ, పరిచారకులూ వెళ్ళే వారు. ఆ ప్రదక్షిణలలో ఒకసారి, ఆ సమూహంలో ఒకరు అధ్యక్షునిగా వ్యవహరిస్తూ మిగిలిన వారు తమ వంతుల ప్రకారము, ఏదైనా ఆధ్యాత్మిక విషయం గురించి ప్రసంగించాలని నిర్ణయించారు. మొదటి ఉపన్యాసకుడు శ్రీ రామనాథ బ్రహ్మచారి (రామనాథ దీక్షితార్). వారు శ్రీ భగవాన్‌తో దాదాపు నలభై సంవత్సరాలు జీవించి, శ్రీ భగవాన్ మహాసమాధికి కొద్ది సంవత్సరాల ముందే శివసాయుజ్యం పొందారు.

ప్రతి ఉపన్యాసకునికి ఒక గంట సమయము కేటాయించ బడింది. కానీ దీక్షితార్ మూడు గంటలు ప్రసంగించారు. సమయం అయిపోయినప్పటికీ పదే పదే పొడిగింపు కొరకు ప్రార్థిస్తూ ఆయన మాట్లాడుతూనే వున్నారు. ఆయన ఉత్సాహము, ఆవేశమూ ఆయనను ఆగనివ్వలేదు. ఎంతో కష్టముతో ఆయనను మూడు గంటల తరువాత ఆపగలిగారు. ఆయన గురించి తెలిస్తే గానీ, ఆయన ఘనత అర్థము కాదు. ఆయన పెద్దగా చదువుకున్న వారూ కాదు; పెద్ద పాండిత్యము కలవారు కాదు. సభలలోనూ,

సమావేశాలలోనూ ప్రసంగించిన వారు కాదు. కేవలం శ్రీ భగవాన్ అనుగ్రహమే వారికా వాగ్వైభవమును ప్రసాదించింది.

ఈ ఉపన్యాసకుడే, తన ఉపన్యాస సారాంశాన్ని ఒక పాటగా రూపొందించారు. ఈ పాట, తరువాత కాలంలో, ఆయన రచన 'స్తోత్ర అనుభూతి'కి అనుబంధంగా ముద్రించబడింది. 1939లో శ్రీ భగవాన్ జయంతి సందర్భంగా ఈ ప్రచురణ భక్తులందరికీ అందచేయబడింది. ఈ 'స్తోత్ర అనుభూతి', అనేక విధాలుగా, ప్రసిద్ధమయిన, 'కందర్ అనుభూతి' తో పోల్చదగ్గ రచన. తమిళ సాహిత్యములో అంతగా పరిచయం లేని, ఈ రచయిత అంత గొప్పగా, ఆ కవితను కూర్చగలిగారంటే దానికి కారణం శ్రీ భగవాన్ అనుగ్రహమే గాని వేరొకటి కాదు.

ఆ ప్రదక్షిణ జరిగిన ఆ రాత్రి విశేషాలు శ్రీ భగవాన్ తరచూ చెబుతూ వుండేవారు. అనేక ఉదాహరణలతో, అనేక అలంకారములతో, అనేక ఆధారాలతో నింపబడి ఎంతో ఉత్సాహముగా చేయబడిన ఆ ఉపన్యాస ప్రతిభ గురించి శ్రీ భగవాన్ ప్రస్తావించిన వైభవాన్ని వివరించుటకు నేను అశక్తుడను.

శ్రీ భగవాన్ తెలియచేసిన మరొక విశేషము: ఒక భక్త సమూహముతో శ్రీ భగవాన్ గిరి ప్రదక్షిణకు వెడుతున్నప్పుడు, దారి పొడుగునా భక్తులు పాటలు పాడసాగారు. ఆ పాటలలో ఒకటి 'తిరుప్పుఘళ్' నుంచీ యెన్నుకున్న పాట. పాట ప్రతి చరణమూ 'కావాలనే' అన్న పదముతో ముగుస్తుంది. తమిళంలో 'కావలనే'

అంటే 'రాజు' అని అర్థము. తెలుగులో 'కావలెనే' అంటే 'కావాలి' అని అర్థము. ఆ భక్త సమూహంలో వున్న ఒక తెలుగు భక్తుడు కంబ్లిస్వామి, ఆ పదాల ద్వంద్వార్థములను గ్రహించిన వారు కనుక, చమత్కారముగా, 'వడ కావలెనే' 'దోశె కావలెనే', 'ఇడ్లీ కావలెనే' అంటూ, పాడేవారు. 'కావలెనే' అని ముగించగానే ఆయన పాడేవారు. శ్రీ భగవాన్, భక్తులూ ప్రదక్షిణ ముగించే సమయానికి, దారిలో అనేక చోట్ల భక్తులు వచ్చి కంబ్లిస్వామి కోరిన పదార్థాలన్నీ వాళ్లకు అందచేశారు!

ఈ సందర్భంగా ఇంకొక విషయం నాకు గుర్తుకు వస్తుంది. భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తూ 'రమణ సద్గురు' పాట పాడుతున్నప్పుడు, శ్రీ భగవాన్ కూడా వారితో కలిసి పాడసాగారు. బృందంలో ఒక భక్తుడు ఇది గమనించి శ్రీ భగవాన్ తమను తామే పొగుడు కుంటూ పాడుతున్నారని ఆశ్చర్యం వ్యక్తపరిచినప్పుడు శ్రీ భగవాన్, "తప్పేమిటి? అందరికీ ఒక్క రమణ సద్గురువే వున్నారు" అని విశదీకరించారు. నేనొకసారి యీ విషయం గురించి శ్రీ భగవాన్‌ను ప్రశ్నించినప్పుడు వారు దానిని ధృవీకరించారు. విరుపాక్ష గుహలో వున్నప్పుడు కూడా ఇలాంటి సంఘటనే జరిగిందని చెబుతారు.

గిరి ప్రదక్షిణ గురించి శ్రీ భగవాన్ స్వయంగా నాతో చెప్పిన ఇంకొక విషయము ప్రస్తుతించదగినది. శ్రీ భగవాన్ స్కందాశ్రమంలో వున్న రోజులలో ఒకసారి వారికి ఉదర సంబంధమయిన ఇబ్బంది కలుగగా ఆ రోజు ఉపవాసం ఉందా

మనుకున్నారు. ఆశ్రమాన్ని వదిలి ప్రదక్షిణకు వెడితే ఉపవాసము చేయుట తేలికైతుందనుకుని ప్రదక్షిణకు బయలు దేరారు. ప్రస్తుతం ఆశ్రమం వున్న స్థలం నుండి ఒకటి రెండు ఫర్లాంగుల దూరం వెళ్ళగానే ఐదారుగురు స్త్రీలు, ఆకులూ, వంట చెరుకూ ప్రోగు చేసుకునేలాంటి వారు - ఎదురయ్యారు. వాళ్ళ చేతుల్లో వున్న ఖాళీ సంచులు ఆ భావాన్ని కల్పించాయి. నీళ్ళెక్కడ దొరుకుతాయని వాళ్ళు శ్రీ భగవాన్‌ను ప్రశ్నించారు. దగ్గరలో నీళ్ళు దొరకకపోవడం వల్ల, వాళ్ళను శ్రీ భగవాన్ తనతో బాటు కొంత దూరం తీసుకు వెళ్ళారు. వాళ్ళను వదిలి, తమ ప్రదక్షిణకు వెళ్ళి పోబోతుంటే, ఆ స్త్రీలలో ఒకామె శ్రీ భగవాన్‌ను వెళ్ళే ముందు తాము తెచ్చుకున్న తినుబండారాలను కొద్దిగా తీసుకోమని ప్రార్థించింది. నిరాకరిస్తే వారి పట్ల దురుసుగా ప్రవర్తించినట్లవుతుందేమోనని, శ్రీ భగవాన్ అంగీకరించారు. కానీ వారు ఆశ్చర్యపడే పరిస్థితి ఏర్పడింది. ఒకామె మూటవిప్పి కొంచెము ఆహారమివ్వగానే, మిగతా వారందరు కూడా తమ మూటలు విప్పి తామిచ్చే ఆహారం కూడా కొద్దిగా తీసుకోవాలని బ్రతిమాలారు. శ్రీ భగవాన్‌కు తప్పలేదు. అందరి దగ్గరా కొంచెము కొంచెము తీసుకున్నా, తామనుకున్నదానికంటే చాలా ఎక్కువ భుజించాల్సి వచ్చింది. (సశేషం)

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింపబడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# డా॥ ఎమ్. అనంత నారాయణ రావు

## (ఆశ్రమ డాక్టరు)

**మల్లాది ఫణిమాల**

డాక్టర్ ఎమ్. అనంత నారాయణరావు గారు బాగా పేరుపొందిన వైద్యులు. 1929వ సంవత్సరంలో ఆయన బాంబే నుండి రైలులో ప్రయాణిస్తున్నారు. ఆయన మరుసటి స్టేషన్లో దిగిపోతారు అనగా ఆయన పక్కన కూర్చున్న వ్యక్తి ఆయనకు శ్రీ రమణుల ఫోటోను చూపించి, "ఆయన గొప్ప మహాత్ములు! తిరువణ్ణామలైలో అంటారు!" అని చెప్పి, ఆ ఫోటోని అనంత నారాయణరావు గారికి ఇచ్చారు. డాక్టర్ అనంత నారాయణరావు గారికి మహాత్ములంటే ఎనలేని భక్తి. అందుకని శ్రీ రమణుల ఫోటోను కృతజ్ఞతతో స్వీకరించారు. 1930వ సంవత్సరంలో అనంత నారాయణరావు గారు పై చదువులకు వెళ్లిపోయారు. శ్రీరమణుల ఫోటో సంగతి పూర్తిగా మరచారు. 1932వ సంవత్సరంలో ప్రభుత్వం అనంత నారాయణరావు గారిని దక్షిణ భారతదేశంలో ఒక వైద్యపరమైన అధ్యయనం నిర్వహించడానికి నియమించింది. అలా దక్షిణాదికి వచ్చినప్పుడు తనకు రైలులో ఇవ్వబడిన ఫోటో సంగతి, వారికి గుర్తుకు వచ్చింది! వారు తిరువణ్ణామలైకి వచ్చి, సతీసమేతంగా శ్రీ రమణులను దర్శించుకున్నారు. వారితో పాటు వారి మిత్రుడు అయినటువంటి డాక్టర్ శివరావు కూడా భగవాన్ సందర్శనార్థం తిరువణ్ణామలైకి వచ్చారు.

తిరువణ్ణామలై చేరగానే శ్రీ రమణులను దర్శించుకుందామని డాక్టర్ అనంత నారాయణరావుగారు శ్రీ రమణాశ్రమానికి వెళ్లారు. ఆశ్రమం నూతి పక్కన ఆరుబయట శ్రీరమణులు కూర్చుని ఉండటం గమనించారు. ధ్యానం చేసేప్పుడు నారాయణరావు గారికి ఎదురయ్యే సమస్యల గురించి శ్రీ రమణులను కొన్ని ప్రశ్నలు వేశారు. శ్రీ రమణుల సమాధానములు క్లుప్తంగా, స్పష్టంగా ఎంతో సందర్భోచితంగా ఉండడాన్ని గ్రహించిన నారాయణరావుగారు అమితంగా తృప్తినొందారు.

తొలి కలయికలోనే సద్గురు రమణుల ఘనతను వారు గ్రహించగలిగారు. శ్రీ రమణాశ్రమములో కేవలం రెండు రోజులు మాత్రమే ఉండ గలిగినప్పటికీ, శ్రీ రమణుల దరహాసం, మెరిసే నేత్రద్వయం శ్రీ అనంత నారాయణరావు గారిలో చెరగని ముద్ర వేశాయి. శ్రీ రమణులు మానవ రూపంలో ఉన్న భగవంతుడు! శాస్త్రములు ఎవరినైతే జీవన్ముక్తుడు, సిద్ధపురుషుడు, జ్ఞాని అని ఘోషిస్తున్నాయో ఆ స్వరూపమే శ్రీ రమణులని నారాయణరావు గారు గుర్తించారు. ఆయన శ్రీ రమణాశ్రమానికి తరచుగా రావడం ప్రారంభించారు. ఆయన రెండోసారి ఆశ్రమానికి వచ్చినప్పుడు శ్రీ రమణుల దివ్యత్వాన్ని అర్థం చేసుకోవటమే కాక సద్గురు రమణుల అనుగ్రహంతో ఆత్మ విచారణ గురించి కూడా పరిజ్ఞానాన్ని పొందారు. భగవాన్ సన్నిధిలో కూర్చుని ప్రయత్నరహితంగానే నిశ్చలత్వాన్ని, మనోనిశ్చలతను పొందారు. ఆంతరంగిక ఆనందము, అంతరంగిక పరిపూర్ణత గురించి చదవటమే కానీ ఎన్నడూ

అనుభవించి ఎరుగని శ్రీ అనంత నారాయణ రావు గారు, వాటిని శ్రీ రమణుల సన్నిధిలో వారి ఎదుట కూర్చోవటం ద్వారా ఎంతో సులభంగా, అప్రయత్నంగా పొందగలిగారు. శ్రీ రమణులు ఒక్క మాటయినా మాట్లాడకుండా మౌనంలోనే ఉన్ననూ, కేవలం వారి సన్నిధిలో కూర్చోవడం వల్ల ఎందరో భక్తులు ఆనందభరితులయ్యే వారు. నారాయణరావుగారు, ఈ అనుభవంతో నిరంతరము ఆత్మ విచారణ చేయటం ప్రారంభించారు.

1942వ సంవత్సరంలో ఉద్యోగ విరమణకి ముందు అనంత నారాయణరావు గారు దీర్ఘకాలం సెలవు తీసుకుని ఆశ్రమ సమీపంలోనే ఉన్నారు. సెప్టెంబర్ నెలలో గురుమూర్తం చూశారు. 1895లో అక్కడ శ్రీరమణులు కొంతకాలం తపస్సు కూడా చేశారు. గురుమూర్తం నుంచి తిరిగి వచ్చాక, ''అక్కడ మీరు ఏమి చూశారు!?'' అని భగవానులు అనంత నారాయణరావు గారిని ప్రశ్నించారు.

శ్రీ రమణులు, గురుమూర్తంలో ఉన్న రోజుల్లో ఏ స్థితిలో ఉండేవారో చక్కగా వివరించి చెప్పారు. శ్రీ రమణుల నోటి వెంట ఈ వివరాలన్నీ వింటున్న వారందరూ మాటలకందని ఆనందమయ స్థితిని పొందారు. 1943లో అనంత నారాయణరావు గారు శ్రీ రమణాశ్రమం ఎదురుగా ఒక ఇంటిని నిర్మించుకుని అక్కడే ఉండాలి అని నిశ్చయించుకున్నారు. అంతేకాకుండా వారు తన ఇంటి పెరట్లో త్వరగా కాపు వచ్చే పళ్ళచెట్లని కూడా నాటారు. ఆ

చెట్ల నుండి వచ్చే మొదటి కాపు ఎప్పుడూ అనంత నారాయణ రావుగారు శ్రీ రమణులకు సమర్పించేవారు. శ్రీరమణులు ఆ పళ్ళను చిన్న చిన్న ముక్కలుగా చేసి ఒక ముక్కను తాము ఉంచుకొని డాక్టర్ రావు గారిని మిగిలిన ముక్కలను అక్కడున్న భక్తులందరికీ పంచమని ఇచ్చేవారు. వింతైన విషయం ఏమిటంటే మూడేళ్లు గడిచినా ఒక్కరోజు కూడా ఒక్క పండు ముక్క కూడా నారాయణరావు గారికి ప్రసాదంగా లభించలేదు. ఓ రోజు ప్రసాదాన్ని పంచి పెట్టి, వారు ఖాళీ పళ్ళెంతో తిరిగి వచ్చారు. నేను ఈ రోజు వరకు శ్రీ రమణుల నుండి ప్రసాదాన్ని ఎందుకు అందుకోలేక పోయాను! అని ఆవేదనతో వారి హృదయం నిండిపోయింది. అప్పుడే శ్రీరమణులు, "అనంత నారాయణరావు గారు, ఇలా రండి. ఇన్ని సంవత్సరాల నుంచి మీరు పళ్ళను ప్రతి ఒక్కరికి పంచి పెడుతున్నారు... కానీ మీకు ఎప్పుడూ ఒక్క ముక్క కూడా మిగలలేదు. అది నేను గమనించాను!" అని, తన ముక్క పక్కన ఉన్న మరో పండు ముక్కను తీసి, "మీ కోసం ఈ చిన్న పండు తీసి పెట్టాను. వచ్చి తీసుకోండి" అన్నారు శ్రీ రమణులు. భగవాన్ నోటివెంట ఆప్యాయతతో నిండిపోయిన ఈ మాటలను విన్న నారాయణ రావుగారికి పట్టలేనంత సంతోషం కలిగింది. "భగవాన్ చేతితో స్వయంగా పండును నాకు ఇచ్చారు! దానిని తీసుకొని నేను తిన గలిగాను. ఇది ఎంత చక్కటి ఆధ్యాత్మిక అనుభవం!" అని అనంత నారాయణరావు గారు తరచూ అంటూ ఉండేవారు.

సాధకునిగా దీని నుంచి అనంత నారాయణ రావు గారు రెండు పాఠాలు నేర్చుకున్నారు. మొదటిది సాధకుడు దేనినైనా ఇచ్చి వేయాలి. సాధకునికి ఏ వస్తువు మీదా వ్యామోహము ఉండరాదు. రెండవది సద్గురువు యొక్క అనుగ్రహం కోసం వేచి ఉండాలి. శ్రీ రమణుల చుట్టూ ఉన్న వారికి, ఇలా సాధనకు ఉపయోగపడే ఎన్నో అంశాలు నేర్చుకునే అవకాశం దొరికేది.

ఒకనాడు శ్రీ రమణులకు తొడ నుండి నడుం వరకు విపరీతమైన నొప్పి రావడం వల్ల వారి కాళ్ళని, పాదాలని మర్దించే భాగ్యం నారాయణరావుగారికి కలిగింది. అనంత నారాయణరావు గారు వారి పాదాలను మర్దించడం చేత శ్రీరమణులకు కొంత ఉపశమనం కలిగింది. సమాధి స్థితిలో ఉంటూనే శ్రీరమణులు ఎప్పుడూ మెలకువ లోనే ఉండేవారు! ఒకసారి రమణులు కోరిన మలాముని నారాయణరావు గారు ఒక పాత్రలో తీసుకుని శ్రీ రమణుల వద్దకు వెళ్లారు. శ్రీ రమణులు కొద్దిగా గురక పెడుతూ ఉండటం చేత నిద్రించి ఉన్నారేమో అని నారాయణ రావు గారు అనుకున్నారు.! ఆ పాత్రని పక్కనే ఉన్న షెల్ఫ్‌లో పెట్టడమా లేక వారు నిద్రలేచే వరకు అక్కడే వేచి ఉండటమా... అని ఆలోచించారు నారాయణరావుగారు. ఒక్క క్షణంలో కళ్ళు తెరిచి, చిరునవ్వుతో ఆ పాత్రని తనకు ఇవ్వకుండా ఎందుకు అలా వేచి ఉన్నారు అని అడిగారు, శ్రీ రమణులు. వారికి అంతరాయం కలిగించడం ఇష్టం లేకపోయిందని నారాయణ రావుగారు

సమాధానమిచ్చారు. వెంటనే రమణులు తాము నిద్రిస్తున్నట్లు ఎట్లా అనుకుంటున్నారని అడిగారు. ఏదో సమాధానాన్ని గొణిగి, వారికి ఆ మలాముని అందించి మిగిలిన వాళ్ళతో హాలులో కూర్చున్నారు అనంత నారాయణరావు గారు. కొద్ది సేపట్లో శ్రీ రమణులు కళ్ళు మూసి నిద్రలోకి జారుకున్నారు. ఈ విధంగా గురువుకు సేవ చేసుకునే భాగ్యం అందరికీ దక్కదు సుమీ!!

డిసెంబరు 1948వ సంవత్సరంలో శ్రీరమణుల చేతిని మర్దన చేస్తూ ఉంటే మోచేతికి పైన ఒక కణితిని అనంత నారాయణరావు గారు గమనించారు. జూలై 1949లో ఆ ప్రాంతమంతా పచ్చి పుండుగా మారింది. శ్రీ రమణులే, నయం చేసుకోవాలంటూ సంకల్పించుకోమని శ్రీ నారాయణరావు గారు ప్రాధేయపడ్డారు. రమణులు చిరునవ్వు నవ్వి, మౌనంగా కూర్చున్నారు. నారాయణ రావు గారు మళ్లీ అర్థించారు. అప్పుడు శ్రీ రమణులు, “ఇక్కడ ఏమీ లేదు కాబట్టి సంకల్పించే ప్రసక్తే లేదు” అన్నారు.

శ్రీ రమణులకు దేహం గాని, దాని రోగాలు గాని పట్టవు. చేతి మీద అయిన పుండుకి కట్టు కడుతున్నప్పుడు ఎంతో కొంత నొప్పి అనివార్యం. కానీ రమణులలో ఏ బాధ కనపడకపోవడం అనంత నారాయణరావు గారిని ఆశ్చర్యానికి గురి చేసింది. పైపెచ్చు ఆ కట్టు కట్టడానికి కుడి చేతితో సహాయం కూడా చేసేవారు శ్రీ రమణులు! ఆ పుండు ఇంకెవరికో అయినట్టు!!

వారి పుండుకి కట్టు కట్టేటప్పుడు ఆ ప్రాంతాన్ని స్పిరిట్‌తో శుభ్రపరచాల్సి వచ్చేది. ఒకసారి అలా శుభ్రపరిచే సమయంలో ఆ స్పిరిట్ వారి చేతి మీదకి వచ్చింది. వెంటనే శ్రీ రమణులు, "స్పిరిట్ స్నానం అయింది నాకు!" అన్నారు. అందరికీ అటువంటి స్పిరిట్‌తో స్నానం అవసరమని కూడా అన్నారు. ఆ మాటలకు అర్థం ఏమిటో తెలియక నారాయణరావుగారు రమణులను వివరించమని కోరారు. చిరునవ్వుతో వారు ఇలా అన్నారు.

"మనమందరమూ ఎప్పుడు శుద్ధ చైతన్యం లోనే ఉంటాం, ఉండాలి కూడా. ప్రయత్నపూర్వకంగా శుద్ధ చైతన్యం అంటే ఆత్మలో ఉండాలి."

ఈ మాటల వల్ల శ్రీ రమణులు ఎల్లప్పుడూ సహజ సమాధిలోనే ఉంటారనే నమ్మకం నారాయణరావు గారికి కలిగింది. 1949లో ఒకసారి శ్రీ రమణులు, మనం సంతోషంగా ఉన్నప్పుడు కన్నీరు ఆవలి కొస నుంచి, విచారంగా ఉన్నప్పుడు లోపలి కొస నుంచి వస్తాయని నారాయణరావు గారితో చెప్పారు. ఇలా చిన్న చిన్న విషయాలలో కూడా శ్రీ రమణులు ఎంతో ప్రగాఢమైన బోధనలు చేసేవారు.

ఉత్కృష్టము, ఉదాత్తము అయిన శ్రీ రమణుల కృప మనందరి మీద స్థిరంగా ఉండాలని సదా కోరుకుందాము!

÷÷÷÷

## అనుస్మరణీయులు

# శ్రీ పూర చిరంజీవి లక్ష్మీ నారాయణ

**శ్రీమతి జలజ**

ఈ జగతిలో మనుష్య జన్మ కలగటానికి ఎంతో పుణ్యం ఉండాలి. ఈశ్వరుడు మనలను ఇక్కడకు పంపారు అంటే మనం మన వాసనలను నిర్మూలించుకొని, ప్రారబ్ధాన్ని అనుభవించి తిరిగి ఈశ్వరునిలో ఐక్యం అవటానికే అని మనం ప్రతీ రోజు స్మరణకు తెచ్చుకోవాలి. ధర్మ మార్గంలో ఉంటూ, భగవంతుని ఉపదేశము లను అనుసరించుతూ వీలైనంత వరకు పాపములు చేయకుండా, సత్యమునే పలుకుచూ, ఒకరిని బాధ పెట్టకుండా మెసలుకొంటూ ఉండాలి. మరు జన్మ లేకుండ మన ప్రయత్నం మనం చేయాలి. ఇవన్నీ మనం అనుసరించాలంటే భగవంతుని యొక్క కృప, సరైన దారిని చూపే గురువు అలానే మన తల్లితండ్రులు మనకు ఇచ్చే సంస్కారము మీద ఎంతో ఆధారపడి ఉంటుంది. మాకు అటువంటి మంచి బాట చూపించిన మా తల్లితండ్రుల గురించి కొన్ని విషయాలు మీతో పంచుకొంటున్నాను.

మా తండ్రి గారు, మా తాత గారికి మూడవ సంతానం. మా తాత గారి కుటుంబం వారంతా చాలా మడి, ఆచారాలను పాటించేవారు. మడితో వంట చేసి భగవంతునికి నివేదన చేసిన తరువాతే భోజనం చేసేవారు. అటువంటి ఉన్నత సంస్కారములు కలిగిన కుటుంబములో పుట్టిన నాన్నగారికి కూడా అవే సంస్కారాలు అలవడినాయి. మా నాన్నగారి పేరు వి.సి.హెచ్. లక్ష్మినారాయణ, మా నాన్నగారు వృత్తిరీత్యా ఇంజనీర్, మా

అమ్మగారి పేరు సీతా మహాలక్ష్మి. పేరుకు తగ్గట్టు వారిరువురు ఆదర్శ దంపతులు. మా అమ్మగారు ఎల్లప్పుడూ నాన్నగారిని అనుసరిస్తూ, నిరాడంబరంగా, నాన్నగారి అభిమతాన్ని ఎరిగి నడుచు కొనేవారు. వారికి మేము నలుగురు సంతానం. ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలం. అటువంటి పుణ్య దంపతులకు జన్మించటం ఎంతో అదృష్టమని మేము భావిస్తున్నాము.

మా అందరికి చిన్నప్పటి నుండే మంచి విషయాలను నేర్పించారు. చిన్నతనం నుండే మాకు భగవంతుని యందు భక్తిని కలిగేటట్లు చేశారు. సుప్రభాతాన్ని నేర్పించటం, అలానే ఎన్నో అన్నమాచార్య కీర్తనలను నేర్పించటం, అనేక శ్లోకాలను నేర్పించటం జరిగింది. వారు రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలను చదివి వాటిలోని నీతిని మాకు చెప్పేవారు.

అమ్మగారు, నాన్నగారు ఎప్పుడూ ఎంతో దైవభక్తి కలిగి ఉండేవారు. నాన్నగారికి బ్రాహ్మీ ముహూర్తమున నిద్ర లేచి ధ్యానం చేసుకోవటం అలవాటుగా ఉండేది. ప్రతీ ఒక్కరికీ గురువు అవసరము ఉంటుంది. అధ్యాత్మిక పథములో గురువు మనకు మార్గ నిర్దేశకునిగా ఉంటాడు. మనల్ని సరైన మార్గములో నడిపిస్తూ ఆత్మ సాక్షాత్కారానికి చాలా తోడ్పడుతాడు. గురువులు ఎప్పుడు కూడా తాము ఆచరించి మనలను ఆచరింప చేస్తారు. అటువంటి గురువును నేను ఇప్పటివరకు పొందలేకపోయానే అని వారు దిగులుపడేవారు. వారికి గురు అన్వేషణ చాలా పెద్ద కష్టం అయ్యింది. దాంతో వారు ఎన్నో పుణ్య క్షేత్రాలను మరియు ఆశ్రమాలను దర్శించుకొన్నారు. కానీ ఎక్కడ కూడా వారికి తృప్తి కలుగలేదు.

నాన్నగారికి పుస్తకాలు చదివే మంచి అలవాటు ఉండేది. అనేక గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను తెచ్చుకొని చదివే వారు. ఆ క్రమంలోనే ఇక్కడే ఉన్న బ్రిటిష్ లైబ్రరీకి వెళ్లి వారికి కావలసిన పుస్తకాలను తెచ్చుకొంటున్న నేపథ్యంలో ఒక పుస్తకం నుండి భగవాన్ శ్రీ రమణుల చిత్రపటం క్రింద పడింది. దానిని తీసి చూసి, అది శ్రీరమణ మహర్షి చిత్రపటంగా గుర్తించారు. వెంటనే ఏమి స్ఫురించింతో కానీ అమ్మగారు, నాన్నగారు ఇద్దరూ తిరువణ్ణామలై ప్రయాణమైనారు.

అక్కడికి వెళ్ళగానే వారిరువురికి ఒక రకమైన దివ్య స్పందన, ఆనందము మరియు మానసిక ప్రశాంతత కలిగాయి. ఇక అంతే, ఎంతగానో వెదికిన సద్గురువు తనంతట తానే దర్శనమిచ్చి తనలో చేర్చుకొన్నారన్న భావన నాన్నగారికి స్థిరపడింది.

అది మొదలు ప్రతీ సంవత్సరం, రమణ జయంతికి గాని, ఆరాధనా దినోత్సవానికి గాని లేదా కార్తీక దీపోత్సవానికి గాని తిరువణ్ణామలై వెళ్లి శ్రీ రమణాశ్రమంలో కొన్ని రోజులు గడిపి వచ్చేవారు. అక్కడికి వెళ్లినప్పుడు స్కందాశ్రమం మరియు విరూపాక్ష గుహను తప్పక దర్శించుకొనేవారు. గిరి ప్రదక్షిణ కూడా చేసేవారు. అమ్మగారైతే పుట్టింటికి వెళ్ళినట్లు భావించేవారు. పుట్టింటికి వెళితే ఎంత సంతోషంగా, ప్రశాంతంగా ఉంటుందో అంత సంతోషానుభూతిని తిరువణ్ణామలైలో పొందేవారు. తిరిగి ఇక్కడికి రావటానికి ఇష్టపడేవారు కాదు. అక్కడ వారు పొందిన అనుభూతులను మాతో పంచుకొనేవారు.

ప్రతీ ఆదివారము మన రమణకేంద్ర సత్సంగాలలో తప్పక పాల్గొనేవారు. డా. కే.యస్. గారితో మరియు సీనియర్ సభ్యులతో

సన్నిహిత పరిచయాలు ఉన్నాయి. వారికి మన కేంద్రముతో 20 సంవత్సరాల అనుబంధం ఉన్నది. నాన్నగారు ఎప్పుడూ శ్రీ రమణుల వారి రచనలు అలా చదువుతూనే ఉండేవారు. అలా చదివిన తరువాత వాటి సారాంశాన్ని తిరిగి తన స్వంత మాటలలో వ్రాసుకొనేవారు. వాటిని ఆచరణలో పెట్టేవారు. మన కేంద్రంలో ప్రసంగాలను కూడా చేసేవారు. నాన్నగారికి బాగా నచ్చిన కొన్ని గ్రంథాలు భగవద్గీత సారము, వివేక చూడామణి, ద్రుక్ దృశ్య వివేకం, ఆత్మ బోధ వంటివి శ్రీ రమణాశ్రమం నుండి తెచ్చి తోటి కేంద్ర సత్సంగ సభ్యులతో పంచుకొనేవారు.

వారు మాతో ఇలా చెప్పేవారు. "అరుణాచల క్షేత్రమున దశ దిశలు విరాజిల్లి, ఒక జ్ఞాన రూపముతో అవతరించిన ఆధ్యాత్మిక దివ్య జ్యోతియే శ్రీ రమణ మహర్షి. వారు ఎల్లప్పుడూ సహజ సమాధి యందుండి, మౌనము ద్వారా మానవులకు జ్ఞానోపదేశము చేసిన కారణ జన్ములు. వారి నోటి నుండి జాలు వారిన మధుర వాక్కులు ఆణిముత్యాలు. ఈ ముత్యాలనే సూక్తులను నాన్నగారు తన చేత్తో వ్రాసి అందరితో పంచుకొనేవారు. మమ్మల్ని వాటిని మననం చేసుకోమనేవారు.

మా అందరితో లౌకిక విషయాలను మాట్లాడటం మానివేసి, ఎప్పుడూ భగవాన్ ఏమి చెప్పేవారో ఆ విషయాలనే చెపుతూ ఉండేవారు. మా బంధువులతో కూడా వారి యొక్క అనుభవాలను పంచుకొనేవారు. వాటి ప్రభావంతో వారందరూ భగవాన్ రమణుల పుస్తకాలను చదవటం, కేంద్రంలో జరిగే సత్సంగాలలో పాల్గొనటం మొదలు పెట్టారు.

కావ్యకంఠ గణపతి ముని గారు రచించిన ఉమా సహస్రాన్ని అమ్మగారు, నాన్నగారు పారాయణ చేసేవారు. అలానే మాచేత కూడా పారాయణ చేయించేవారు. ఇంట్లో ఏ శుభకార్యం ఉన్నా, ఆరోగ్యం బాగోలేక పోయినా, పిల్లలకు పరీక్షలు ఉన్నా వారిరువురు ఉమా సహస్ర పారాయణ చేసేవారు. ప్రతీ రోజు సాయంత్రం వేళ ఇంట్లో ఉన్న సభ్యులందరము కలసి ఉపదేశ సారము పాడి భగవాన్‌కు హారతి ఇచ్చి నైవేద్యం సమర్పించిన తరువాత భోజనము చేసేవారము.

మా నాన్నగారికి కొంచెం కోపం ఎక్కువగా ఉండేది. భగవాన్ మార్గంలోకి వచ్చిన తరువాత ఆ కోపం చాలా తగ్గి పోయింది. నాన్న గారు అణ్ణామలై విశ్వ విద్యాలయంలో ఇంజనీరింగ్ చదువు తున్న రోజులలో భగవాన్ దగ్గరికి వెళ్ళే అవకాశం వచ్చినా వెళ్ళ లేక పోయారు. అక్కడకు వెళ్లి భగవాన్ కృపా కటాక్షాలకు పాత్రుని కాలేదని జీవితాంతం బాధపడేవారు.

మా అమ్మగారు శ్రీ రమణుల వలే మౌనంగా ఉండటాన్ని ఇష్టపడేవారు. ఆ క్రమంలోనే వారంలో ఒక రోజు మౌన వ్రతం ఆచరించాలని సంకల్పించి ప్రతీ సోమవారం మౌనంగా ఉంటూ ఉపవాసం చేసేవారు. నాన్నగారు, అమ్మగారు ప్రతీ సంవత్సరం ఏదైనా ఒక ఆశ్రమం సందర్శించి అక్కడ రెండు నెలలు గడిపి వచ్చేవారు.

మా అమ్మగారు భగవాన్‌లో ఐక్యమైన తరువాత, నాన్నగారు తీవ్రంగా కృంగిపోయారు. ఎల్లప్పుడూ శ్రీ రమణ నామ స్మరణలోనే ఉండేవారు. శ్రీ రమణుల వలే దేహం మీద ఆసక్తి ఉండేది కాదు.

వారు పడుకొనే చోట భగవాన్ చిత్రపటం పెట్టుకొని భగవాన్ నే చూస్తూ నామస్మరణ చేస్తూ ఉండేవారు. నామజపం వలన శక్తి కలుగుతుంది. ఆ శక్తి వలన ఆత్మ మాలిన్యం నిర్మూలింప బడుతుంది అని నమ్మేవారు. ఆపదలో ఉన్నవారిని ఎంతగానో ఆదుకొనేవారు. అన్న దానములు చేసేవారు. మా అందరి చేత చేయించేవారు.

నాన్నగారి బోధనలు, అమ్మగారి నడవడి ప్రభావంతో, మాకు రమణ కేంద్రం వెళ్ళాలి అనే ఆశ చాలా ఉండేది. అప్పుడు శ్రీ రమణులే వారి జయంతి రోజున కేంద్రానికి రప్పించుకొన్నారు. ఇక అప్పటినుండి ప్రతీ ఆదివారము రమణ కేంద్రమును దర్శించటం ఒక పరిపాటి అయింది. అక్కడ పొందే అనుభూతి మాటలలో వర్ణించలేము. మన ఎదురుగా భగవాన్ ఉన్న అనుభూతి కలుగుతుంది. కేంద్ర సభ్యులలో అమ్మ, నాన్నగారు దర్శనమిస్తారు. కేంద్రంలో జరిగే ఉమా సహస్ర పారాయణలో పాల్గొనటం గొప్ప అదృష్టంగా భావిస్తాను. అంతే కాకుండా తిరువణ్ణామలై వెళ్లి శ్రీ రమణాశ్రమంలో, కలువరాయి శ్రీ రమణ గణపతుల ఆశ్రమంలో, గోకర్ణం మరియు విజయవాడ కనకదుర్గ ఆలయాలలో ఉమా సహస్ర పారాయణలో పాల్గొనే భాగ్యం నాకు కలిగింది. అది ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. భగవాన్ శ్రీ రమణులే అనుగ్రహిస్తున్నారన్న అనుభూతి కలుగుతుంది. అమ్మ, నాన్నగారు వేసిన బీజము మహా వృక్షము కావాలని, భగవాన్ అనుగ్రహం సంపూర్ణంగా పొందాలని, వారి పాద పద్మాలకు నమస్కరిస్తూ

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

## Follow the Deshika's Disha

(Talk 76)

Dr K Subrahmanaian

*sraddhavan labhate jnaanam*

If you want *jnana*, you must have faith. However, when it comes to spiritual matters, much of the time we have doubts; we wonder if we are following the right path. We want assurances that the *guru* will take us to the right destination. In everyday life, we realize that we have faith. We cannot live even for a single day in the normal way we do, unless we have faith in others. We have faith that our children are attending school regularly - we don't follow them to school every day. We have faith that those who work under us will come on time and that the people we talk to speak the truth. After buying a ticket to Vijayawada, we don't go to the Station Master to find out the name of the driver and if he's qualified to drive the train. We hope that he will not be drunk, and that everything will work out well.

It is on the basis of faith that we do everything in this world; if we start doubting every little thing, we can't exist, even for a single day. From morning to evening, we have this faith that everything will work out well. At the end of the day, when we go to bed, we hope that we will get up the next morning. Even though from time to time, we read that so and so passed away in his sleep, we continue to think that these things are exceptions, and won't happen

to us. We have no doubt that we will get up the next morning.

When it comes to instructions from the *guru*, however, we have all kinds of doubts. We wonder whether what he says is correct, and whether he will take us to the right goal, and so on. This is where we have to be careful. When we have chosen a *guru*, the important thing is to follow what he says. If we don't, it'll be you and not the *guru* who'll be affected. There are so many things in life that we fail to understand because of our limited intellect. For example, every day we seek something or the other. What do we do? We work hard to get it. There is a lot of *mano vyakula* – tension – and we wonder whether we will get what we want. We try various ways of getting it. Sometimes, we go to someone, get some recommendation and get what we want. When we get it, we are happy.

So, whenever we have a desire of any kind, we spend a lot of energy and time trying to fulfill it. However, a few days after getting what we want, we want something else. Our whole life is spent in getting things, enjoying them for a short period, and then, tiring of them. Hence, we look to other things to keep us happy. We not only want to possess things, but people as well. We know from experience, however, that we have no control over people or things. Yet, when a person gives himself to us without expecting anything in return - something happens to us. We begin to doubt the person.

What is love? It is when we give ourselves completely to somebody. When we give ourselves to somebody, we

